సాక్షి నాగర్‌కర్నూల్

మంగళవారం । 8 । ఆగస్టు । 2023



సమీకృత మార్కెట్..

మున్సిపాలిటీల్లో సమీకృత మార్కెట్ నిర్మాణం నత్తనడకన సాగుతుంది.

వివరాలు 8లో ▸



జూరాలకు పెరిగిన వరద

ప్రియదర్శిని జూరాలకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో 74 వేలకు పెరిగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 31.3 /23.1

ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రమంగా ఆకాశం మేఘావృతం అవుతుంది. వర్షం పడే అవకాశం లేదు.

న్యూస్‌రీల్

వినతులు సత్వరం పరిష్కరించాలి

కందనూలు: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యమిస్తూ ప్రజల విజ్ఞప్తులను సత్వరమే పరిష్కారించాలని కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగగిన పరిష్కరించాలని ఆదేశించారు. కాగా ప్రజా వాణి కార్యక్రమానికి మొత్తం 317 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. అందులో ధరణికి సంబంధించి 200 వినతులు రాగా వివిధ శాఖలకు సంబంధించిన 30 ఫిర్యాదులు వచ్చాయి. 87 దరఖాస్తులు జిల్లాలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎం పోస్టులను క్రమబద్ధీకరించాలంటూ ఏఎన్‌ఎంలు కలెక్టర్‌కు వినతి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ సీతారామారావు, డీఆర్ ఓ నర్సింగ రావు, సీపీఓ భూపాల్‌రెడ్డి, ఈడీఎం నరేష్, పీఎస్ ఖాజామైనుద్దిన్, ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 10 వినతులు

పోలీసు ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించేందుకు సిబ్బంది కృషిచేయాలని ఎస్పీ మనోహర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎస్పీ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసు కున్నారు. మొత్తం 10 ఫిర్యాదులు వచ్చాయని ఇందులో 5భూతగాదాకు సంబంధించి, అదనపు కట్నం కోసం వేధింపులు ఒకటి, డబ్బులు తీసుకొని మోసం చేశారని ఒకటి,ఇతర ఫిర్యాదులు మూడు వచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

ఆలయానికి రెండు కేజీల వెండి నాగఫణి వితరణ



ఉప్పునుంతల: ఉప్పునుంతల కేదారేశ్వరాలయానికి సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ ఎంకోజీ కళావతి దంపతులు రూ.1.55 వేల విలువ చేసే రెండు కేజీల వెండి నాగఫణిని వితరణ చేశారు. ఈసందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఆలయ కమిటీ తరపున బంధం బాలకృష్ణ, శేఖరాచారి ఎంకోజీ దంపతులను సన్మానించగా సర్పంచు కట్టా సరిత అనంతరెడ్డి వారిని సన్మానించి అభినందించారు.

మద్యం దుకాణాలకు 25 టెండర్లు దాఖలు



మహబూబ్‌నగర్ క్రైం/కందనూలు: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న 230 మద్యం దుకాణాలకు టెండర్లు వస్తున్నాయి. ఈ నెల 4 నుంచి నూతన మద్యం పాలసీ కోసం ఎక్సైజ్ శాఖ టెండర్లు స్వీకరిస్తున్న క్రమంలో మద్యం వ్యాపారులు దుకాణాలు సొంతం చేసుకోవడానికి ఒక్కో దుకాణానికి రూ.2 లక్షల డీడీలు చెల్లించి దరఖాస్తు చేసుకుంటున్నారు. సోమవారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 25 టెండర్లు పడ్డాయి. ఇందులో మహబూబ్‌నగర్, నారాయణపేట కలిపి 8, నాగర్‌కర్నూల్ 6, గద్వాల 5,వనపర్తి జిల్లాలో 6టెండర్లు పడ్డాయి. ఇక ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 34 టెండర్లు రాగా.. ప్రభుత్వానికి రూ.68 లక్షల ఆదాయం సమకూరింది. మద్యం దుకాణాలకు టెండర్ దాఖలు చేయడానికి ఈ నెల 18 వరకు అవకాశం ఉండటంతో వ్యాపారులు చివరి రెండు రోజుల్లో భారీగా టెండర్ వేసే అవకాశం ఉంది.

జిల్లాలో 6 టెండర్లు

నాగర్‌కర్నూల్ జిల్లాలోని 67 మద్యం దుకాణాలకుగాను సోమవారం ఆరు మద్యం టెండర్లు దాఖలైనట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఫాయాజుద్దిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు మొత్తం ఎనిమిది టెండర్లు దాఖలైనట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి డివిజన్‌లో 4, కొల్లాపూర్ డివిజన్‌లో 4 చొప్పున టెండర్లు వచ్చినట్లు తెలిపారు. టెండర్ దరఖాస్తు గడువు తేదీ ఈనెల 18 వరకు ఉంటుందని, ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు.

ప్రతిపాదనలతో సరి..

ఏళ్లుగా కలగానే అదనపు రిజర్వాయర్లు

- కృష్ణానదికి వరదలు వచ్చినా నికర జలాలు వినియోగించుకోలేని దుస్థితి
- మూడేళ్లయినా అమలు కానీ సీఎం ఆదేశాలు
- జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు సామర్థ్యం పెంపుపై జాప్యం
- కేఎల్‌ఐ చివరి ఆయకట్టుకి పూర్తి స్థాయిలో అందని సాగునీరు

ఎగువ నుంచి భారీగా వరద వచ్చినా.. కృష్ణానదిలో సమృద్ధిగా నీరున్నా.. చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో నీరు వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో అదనపు రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినా.. అవి సర్వేలు, ప్రతిపాదనలకే పరిమతమవుతున్నాయే తప్పా ఒక్క అడుగు ముందుకు పడడంలేదు. ప్రస్తుత రిజర్వాయర్ల సామర్థ్యం తక్కువగా ఉండడం.. కొత్తవి ప్రతిపాదనలకే పరిమితమవడంతో అనుకున్న లక్ష్యం నెరవేరక.. ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.



సామర్థ్యం పెంచడానికి గుర్తించిన గుడిపల్లి రిజర్వాయర్

జిల్లాలో అదనపు రిజర్వాయర్లు, ఆయకట్టు వివరాలు				
ప్రతిపాదించిన రిజర్వాయర్లు	సాధ్యమని తేల్చినవి	నీటి నిల్వ సామర్థ్యం	ఆయకట్టు లక్ష్యం(ఎకరాల్లో)	ప్రస్తుతం అందుతున్నది
47	10	20 టీఎంసీలు	4.25 లక్షలు	3 లక్షలు

అచ్చంపేట: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో కింద 4.25లక్షల ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. వరదల సమయంలో 120రోజుల్లో 40 టీఎంసీల కృష్ణా మిగులు జలాలను వాడుకునేలా ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు. నీటి నిల్వ చేసే రిజర్వాయర్లు తక్కువ సామర్థ్యంతో ఉన్నాయి. ప్రస్తుతం నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారుగా 2లక్షల నుంచి 3లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు. ఎల్లూరు, సింగోటం, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు రిజర్వాయర్ల సామర్థ్యం కేవలం 4టీఎంసీలు మాత్రమే. దీంతో చివరి ఆయకట్టు వరకు సాగునీరందించడం కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో ఆదనపు రిజర్వాయర్ల నిర్మాణం ప్రతిపాదన ఐదేళ్ల క్రితం తెరపైకి వచ్చినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

వరద వస్తున్నా.. వినియోగించుకోలేక

2020లో ఎగువనున్న ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 1511.076 టీఎంసీల నీరు రాగా 1768.73 టీఎంసీల నీటిని దిగువన ఉన్న నాగర్జునసాగర్‌కు వదిలారు. ఆదే విధంగా 2021లో 1087.927 టీఎంసీల నీరు వస్తే 1092.81 టీఎంసీలు, గతేడాది 2022లో 1224.650 టీఎంసీల నీరు శ్రీశైలం ప్రాజెక్టుకు చేరింది. ఇందులో 1191.47 టీఎంసీల నీటిని దిగువన్న ఉన్న సాగర్‌కు విడుదల చేశారు. ఈఏడాది ఇప్పటి వరకు ఎగువ ప్రాజెక్టుల నుంచి శ్రీశైలానికి 33.8821 టీఎంసీల వరద నీరు వచ్చింది.

ప్రతిపాదనలు బుట్టదాఖలు

కేఎల్ఐ కింద 47 అదనపు రిజర్వాయర్లను ప్రతిపాదించగా వీటిలో కేవలం 10మాత్రమే సాధ్యమని గుర్తించారు. ఇందుకు సంబంధించి సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. పూర్తి ఆయకట్టుకు సాగునీరు అందించాలంటే కనీసం 20 టీఎంసీలు నిల్వ చేసే సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు అవసరమని సాగునీటిశాఖ అధికారులు చెబుతున్నారు. 2021లో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులపై సమీక్ష నిర్వహించిన సీఎం కేసీఆర్ ఎంజీకేఎల్ఐలో రిజర్వాయర్ల సామర్థ్యం పెంపుపై డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈమేరకు ఇంజనీరింగ్ అధికారులు 2.14 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉన్న జొన్నలబొగుడ జలాశయాన్ని 6టీఎంసీల వరకు, సుమారు టీఎంసీ సామర్థ్యం ఉన్న గుడిపల్లిగట్టు జలాశయాన్ని 3నుంచి 4టీఎంసీల వరకు పెంచుకోవచ్చని అంచనా వేశారు. కానీ, నేటికీ ఒక్క రిజర్వాయర్ మంజూరు చేయలే.

కాల్వల సామర్థ్యం..

కేఎల్ఐ ప్రాజెక్టు మొదటి డిజైన్ ప్రకారం కాల్వల వెడల్పు చేయకుండా అప్పట్లో కుదించారు. దీంతో పంపింగ్ చేసే నీటి సామర్థ్యాన్ని తట్టుకోలేక కాల్వ కట్టలు అక్కడక్కడ తెగుతున్నాయి. ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు పంపింగ్ దగ్గర ఉన్న ఐదు మోటార్లు ఒకేసారి పంపింగ్ చేస్తే 4వేల క్యూసెక్కులకు పైగా నీటిని తోడిపోస్తాయి. ఈ నీళ్ల వెళ్లాలంటే 9మీటర్ల వ్యాసం గల కాల్వలు ఉండాలి. ప్రస్తుతం 6,7 మీటర్లతో ఏర్పాటు చేయడంతో తరుచూ కాల్వలకు గండ్లు పడి పంట పొలాలు నీట మునుగుతున్నాయి. ఈసమస్యలను పూర్తిగా అధిగమించాలంటే కాల్వల ఎత్తు సైతం పెంచాలన్న ప్రతిపాదనలు కొనసాగుతున్నాయి.

4టీఎంసీలు మాత్రమే..

కేఎల్ఐ మొదటి లిఫ్ట్ ఎల్లూరు రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం కేవలం 0.35 టీఎంసీలు మాత్రమే. ఈ లిఫ్ట్ ద్వారానే మిషన్ భగీరథకు 7.2 టీఎంసీల నీటిని సరఫరా చేయాలి. ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాలు, రంగారెడ్డి జిల్లాకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేస్తారు. ఇక సింగోటం రిజర్వాయర్ నీటి సామర్థ్యం కూడా 0.55, గుడిపల్లిగట్టు రిజర్వాయర్‌ది 0.96 టీఎంసీలే. అంటే ఒక టీఎంసీ కూడా కాదు. జొన్నలబొగుడ రిజర్వాయర్‌ను 2.14టీఎంసీల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించారు. మరో 20టీఎంసీల నీటి నిల్వ కోసం ఏడేళ్లుగా ప్రతిపాదిస్తున్నా ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. దీంతో చెరువులు, కుంటలను నింపి వదిలేస్తున్నారు. ఏటా డిసెంబరు నుంచి వేసవి కాలంలో నీటినిల్వ తగ్గిపోయి నీటి సరఫరా అటంకం ఏర్పడుతుంది. ఏడాది పాటు మిషన్ భగీరథకు తాగునీరు అందించాల్సి ఉన్నా మార్చి నుంచి కేఎల్ఐ మోటార్లకు కృష్ణానది తిరుగు జలాలు అందడం లేదు. కేఎల్ఐకి కృష్ణానది జలాలు 40టీఎంసీల కేటాయింపు ఉన్నా 15టీఎంసీల నీటిని ఎత్తిపోస్తున్నారు.



పది రిజర్వాయర్లను గుర్తించాం



కేఎల్ఐ పరిధిలో 20టీఎంసీల సామర్థ్యం గల 10 రిజర్వాయర్లను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదించాం. వరదల సమయంలో కేఎల్ఐ నుంచి 20టీఎంసీలు ఎత్తిపోయాలని ఆదేశాలు ఉన్నాయి. జొన్నలబొగుడ, గుడిపల్లిగట్టు నీటి సామర్థ్యం పెంచే ప్రతిపాదనలు ఉన్నాయి. చెరువులు, కుంటలకు కూడా నీటిని విడుదల చేస్తాం.

– విజయభాస్కర్‌రెడ్డి, ఎస్ఈ

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

కలెక్టర్ ఉదయ్‌కుమార్

కందనూలు : తెలంగాణకు హరితహారంలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన లక్ష్యం మేరకు మొక్కలు సకాలంలో నాటేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ అన్నారు. సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రిన్సిపాల్ సెక్రటరీతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. జిల్లాలో ప్రగతి గూర్చి కలెక్టర్ వివరిస్తూ.. హరితహారం కార్యక్రమంలో ఏవెన్యూ ప్లాంటేషన్‌తో పాటు, ఇరిగేషన్ శాఖ కొరకు సేకరించి, మిగిలిన ఖాళీ స్థలంలో సంపద వనాలు, మొక్కలు నాటే పనులు కొనసాగిస్తున్నామన్నారు. జిల్లాలో 6 సైట్‌లు 118 ఎకరాల ఖాళీ స్థలం గుర్తించడం జరిగిందని, వాటిలో ఇప్పటికే 45 శాతం మొక్కలు నాటడం పూర్తి అయిందన్నారు. మిగిలిన వాటికి గుంతలు తవ్వడం, ప్రహరీ ఏర్పాటు చేయడం పూర్తి అయ్యిందని తెలిపారు. త్వరలోనే వంద శాతం మొక్కలు నాటే ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

సజావుగా గొర్రెల పంపిణీ

జిల్లాలో గొర్రెల పంపిణీ కార్యక్రమం సజావుగా జరుగుతుందని గడువులోగా నిర్దేశించిన లక్ష్యం మేరకు గొర్రెల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. బీసీ, మైనారిటీ బంధులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసి గ్రౌండింగ్ పూర్తి చేయడం జరుగుతుందన్నారు. పేదలకు హౌజ్ సైట్ పట్టాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని, గుర్తించిన స్థలాల్లో లేఅవుట్ చేయించి అప్రూవల్ పూర్తి చేశామని, ఇప్పటికే కొన్ని సైట్‌లలో పట్టాలు పంపిణీ చేశామన్నారు. అదనపు కలెక్టర్లు కుమార్ దీపక్, కే. సీతారామారావు,డీఎఫ్ఓ రోహిత్ గోపిడీ, ఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

10లోగా 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోవాలి

ఈనెల 10వ తేదిలోపు గృహలక్ష్మి పథకానికి నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తులు కలెక్టరేట్‌లో కానీ, మండల అభివృద్ధి అధికారులకు గానీ దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తెల్ల రేషన్ కార్డులు కలిగి ఉన్న పేద గృహిణులు, ఒంటరి మహిళలు, గృహలక్ష్మి పథకం ద్వారా సొంత ఇళ్లు నిర్మించుకునేందుకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇళ్లు లేని పేదలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సహాయం వంద శాతం సబ్సిడీపై మంజూరు చేస్తుందని, ఒక్కో నియోజకవర్గం నుంచి 3వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారని పేర్కొన్నారు. రూ.మూడు లక్షలు, మూడు విడతల్లో విడుదల చేయనున్నట్లు, అర్హత కలిగిన ఎస్సీ, ఎస్టీ, బీసీ. మైనారిటీ వర్గాల వారు తగిన ఆధారాలతో ఆన్‌లైన్, లేదా ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తులను, వెనువెంటనే పరిశీలించాలని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా బోధించాలి

అచ్చంపేట రూరల్/ బల్మూర్: విద్యార్థులకు అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని డీఈఓ గోవిందరాజులు అన్నారు. సోమవారం అచ్చంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న తొలిమెట్టు ఇంగ్లీష్ శిక్షణా శిబిరాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు వర్కు పుస్తకాలు పంపిణీ చేశామని, ఉపాధ్యాయులకు పాఠ్య బోధన ప్లాన్ అందించామని, వాటిని వినియోగించుకోవాలన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్ మాట్లాడే విధంగా తీర్చిదిద్దాలని, పాఠ్యాంశాలకు సంబంధించిన టీఎల్ఎంను ముందు రోజే తయారు చేసుకోవాలన్నారు. అలాగే బల్మూర్ మండలంలోని కేజీబీవీని పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ రామారావు, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ షర్ఫుద్దీన్, వెంకటయ్య, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ గోవిందరాజులు

నిబంధనలు పాటించని ల్యాబ్‌లపై చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్

అచ్చంపేట రూరల్: నిబంధనలు పాటించని ప్రైవేట్ ల్యాబ్ నిర్వాహకులపై చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని టీఎన్‌జీఓ భవనంలో ప్రైవేటు ల్యాబ్ నిర్వాహకులతో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రతి ల్యాబ్ నిర్వాహకుడు ల్యాబ్ ఎదుట ధరల పట్టిక ఉంచాలని ఆదేశించారు. అనుమతి తీసుకొని అర్హులైన వారు మాత్రమే ల్యాబ్‌లను నిర్వహించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో కలుషితమైన నీరు, ఆహారం ద్వారా నీళ్ల విరేచనాలు, టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అర్హులైన వైద్యులు సూచించినప్పుడు మాత్రమే పరీక్షలు చేయాలని ఆదేశించారు. రక్త, మూత్ర పరీక్షలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం చేయాలని, అధికంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి డయోగ్నోస్టిక్ సెంటర్, క్లీనిక్‌లు వైద్య, ఆరోగ్యశాఖ నుంచి అనుమతులు పొందాలని సూచించారు. అనుమతి లేని వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తారాసింగ్, అశోక్‌ప్రసాద్, సందీప్, శ్రీను, రాజేష్ పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: ఎనిమిది నెలలుగా ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంల వేతనాలు విడుదల చేయకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందని, తక్షణం వేతనాలను విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం ఈమేరకు డీఎంహెచ్ఓ సుధాకర్‌లాల్‌కు ఔట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలతో పాటు ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 8 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం వల్ల కుటుంబ పోషణ కష్టంగా మారిందని, తక్షణమే ప్రభుత్వం వారి వేతనాలను విడుదల చేసి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు విజయ, సుమతి, లక్ష్మీ, రాధ, శివలీల, హైమావతి పాల్గొన్నారు.

26 మంది సివిల్ ఎస్ఐల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రైం: రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం విడుదలైన ఎస్ఐ ఫలితాల్లో జోగులాంబ గద్వాల జోన్–7 పరిధికి సంబంధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 26 మంది సివిల్ ఎస్ఐలు, ఐదుగురు ఏఆర్ ఎస్ఐలు ఎంపికయ్యారు. ఎంపికైన 26 మంది సివిల్ ఎస్ఐలలో 8మంది అమ్మాయిలు కాగా.. 18 మంది అబ్బాయిలు ఉన్నారు. అలాగే ఏఆర్ ఎస్ఐలలో నలుగురు అబ్బాయిలు.. ఒక అమ్మాయి ఉంది. ఎంపికైన ఎస్ఐలకు త్వరలోనే విధులు కేటాయించనున్నారు.

ఆయిల్‌పాం కోతలు షురూ..



నారాయణపేట జిల్లా మక్తల్ మండలం మాద్వార్‌లో కత్తిరించిన గెలలతో అధికారులు

- కన్మనూర్, మాద్వార్ గ్రామాల్లో గెలల కత్తిరింపు
- అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ మిల్లుకు తరలించేందుకు చర్యలు
- పేటలో 8,620 ఎకరాల్లో సాగు
- ప్రస్తుతం టన్ను గెలల ధర రూ.13,091

పేటలో సాగు వివరాలు (ఎకరాల్లో)..		
ఏడాది	లక్ష్యం	సాగైంది
2021	2,500	1,225
2022	5,400	4,150
2023	6,500	3,245

మరికల్: జిల్లాలో రైతులు సాగు చేసిన ఆయిల్‌పాం తోటలు కోతకు వస్తున్నాయి. ఏటా సంప్రదాయ పంటల సాగుతో నష్టాలు చవి చూస్తూ అప్పుల పాలవుతున్న రైతులు ఆయిల్‌పాం సాగుపై దృష్టి సారించారు. ఒకసారి మొక్కలు నాటితే 35 ఏళ్లుగా లాభాలబాటలో పయనించవచ్చని ఉద్యానశాఖ అధికారులు ప్రోత్సహించడంతో అప్పుల నుంచి గట్టెక్కడానికి వాణిజ్య పంటలే మేలని రైతులు మొగ్గు చూపుతున్నారు. 2021 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహంతో జిల్లాలో ఆయిల్‌పాం తోటల సాగు దిశగా అడుగులు వేస్తున్నారు. వీటి సాగుకు ఇక్కడి భూములు అనుకూలమని అధికారుల విస్తృతంగా రైతులకు అవగాహన కల్పించారు. మార్కెట్ బాధ్యతలను కూడా ప్రభుత్వమే తీసుకోవడంతో రైతులకు కలిసిరానుంది. ప్రస్తుతం జిల్లాలో 2021లో నాటిన మొక్కలు ప్రస్తుతం గెలలు కత్తిరింపునకు వచ్చాయి. కానీ ఇక్కడ ఆయిల్‌ఫెడ్ మిల్లు లేకపోవడంతో ఖమ్మం జిల్లా అశ్వరావుపేట మిల్లుకు అధికారులు తరలిస్తున్నారు.

కన్మనూర్, మాద్వార్‌లో కోతకు వచ్చిన తోట..

జిల్లాలో 2021 నుంచి ఇప్పటివరకు 8,620 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేయగా మరికల్ మండలం కన్మనూర్‌లో 6 ఎకరాలు, మక్తల్ మండలం మాద్వార్ గ్రామాల్లో 5 ఎకరాల తోట ప్రస్తుతం కోతకు వచ్చాయి. గెలలను తొలగించడంలో శిక్షణ పొందిన కూలీలచే కటింగ్ చేయించారు. మొదటి కటింగ్ కావడంతో ఒక్కో రైతుకు 5నుంచి 6 క్వింటాళ్ల చొప్పున దిగుబడి వచ్చింది. ఇప్పటి నుంచి 35 ఏళ్ల వరకు ప్రతినెలా గెలలు చెట్టు నుంచి తీయాల్సి ఉంటుంది.

అందుబాటులో నర్సరీ..

మరికల్ మండలం కన్మనూర్ శివారులో రెండు లక్షల ఆయిల్‌పాం మొక్కలను పెంచారు. వీటికి ఏడాది పూర్తి కావడంతో ఇక్కడి నుంచే జిల్లాల్లో నాటే రైతులకు మొక్కలు అందజేస్తున్నారు. రైతుల నుంచి బాగా డిమాండ్ రావడంతో మరో లక్ష మొక్కలను పెంచేందుకు ఉద్యానశాఖ అధికారులు చర్యలు చేపట్టారు.

గెలలు వచ్చే దశ ఇలా..

మొక్క వేసేటప్పుడు 10–12 ఆకుల వుండి, తదుపరి నెలకు 2 ఆకులు చొప్పున ఏడాదికి 24 ఆకులు వస్తాయి. 4వ సంవత్సరంలో మొదటి కోత వస్తుంది. ఆ సమయంలో గెలలు తయారు కావడానికి పక్వ దశ రావడానికి పూత వికసించిన దశ నుంచి 150రోజుల సమయం పడుతుంది. పక్వ దశకు వచ్చిన గెలలను తెంపి గెలల సేకరణ కేంద్రాలకు పంపాలి. గెలల పరిమాణం సరాసరి 7వ సంవత్సరం వయస్సు మొక్క నాటిన 84 నెలల వయస్సుకు 5 లేక 6కేజీల నుంచి 18–20 కేజీలు 3 రెట్లు పరిమాణం పెరుగుతాయి. సరాసరి ఒక చెట్టుకు 12 గెలలు బరువు 20 కేజీల చొప్పున 245 కేజీలు ఎకరానికి సరాసరి నికర 57 మొక్కలకు ఏడాదికి 12 టన్నుల దిగుబడి వస్తుంది. ప్రస్తుతం గెలల రేటు టన్నుకు రూ.13,091 ఉంది.

అశ్వారావుపేటకు తరలింపు..

మొదట కన్మనూర్, మాద్వార్‌లో కోతకు వచ్చిన ఆయిల్‌పాం తోటల గెలలను కత్తిరించారు. వీటిని ఇక్కడే తూకం వేసి వాహనాల్లో అశ్వరావుపేటలోని ఆయిల్‌ఫెడ్ మిల్లుకు తరలిస్తున్నారు. ప్రతి నెలకు కత్తిరించే గెలలను ఆయిల్ మిల్లుకు తరలించే బాధ్యత ప్రభుత్వానిదే. ఆయిల్‌పాం చట్టం ప్రకారం రైతులు తోటలు సాగు చేసినా రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహణ, మార్కెటింగ్ చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా కేంద్రాలను ఏర్పాటు చేసి ఆయిల్‌పాం గెలలను కొనుగోలు చేసి, మలేషియా లిమిటెడ్ కంపెనీకి అప్పగించనుండటంతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు పేర్కొంటున్నారు.

బీచుపల్లిలో మిల్లు సిద్ధం చేస్తున్నాం

ప్రస్తుతం జిల్లాలోని రెండు గ్రామాల్లో కోతకు వచ్చిన ఆయిల్‌పాం తోటల కత్తిరింపు ప్రారంభించాము. కత్తిరించిన గెలలను ఇక్కడే తూకం వేసి అశ్వరావుపేట మిల్లుకు తరలిస్తున్నాం. మరో ఏడాదిన్నరలోపు బీచుపల్లి వద్ద ఆయిల్‌ఫెడ్ మిల్లును సిద్ధం చేస్తున్నాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

–మోయిన్, ఆయిల్‌ఫెడ్ డీసీఓ, నారాయణపేట

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో చిన్నారి మృతి

ఊర్కొండ: ద్విచక్రవాహనం గేదెను ఢీకొట్టడంతో ఏడాది చిన్నారి అక్కడికక్కడే మృతి చెందగా తల్లిదండ్రులకు గాయాలైన ఘటన సోమవారం జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్‌ఐ లెనిన్ కథనం ప్రకారం.. మిడ్జిల్ మండలంలోని వేములకు చెందిన కావలి రాఘవేందర్, రాధిక భార్యాభర్తలు. వారికి ఏడాది కూతురు ప్రిన్సి ఉంది. భార్య కడుపుతో ఉండడంతో ఆమెను, పాపను తీసుకొని ద్విచక్ర వాహనంపై కల్వకుర్తి ఆస్పత్రికి బయలుదేరాడు. ఊర్కొండ మండల పరిధిలో కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారిపై ద్విచక్రవాహనం గేదెను ఢీకొట్టింది. దీంతో పాప అక్కడికక్కడే మృతి చెందగా, భార్యాభర్తలకు గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో గేదె కూడా మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మూర్ఛతో వ్యక్తి..

నవాబుపేట: మూర్ఛ వ్యాధితో కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని హన్మాసానిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన శేఖర్(30) రెండు నెలల కిందట మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఆదివారం మండల కేంద్రానికి వచ్చిన శేఖర్ సంత నుంచి తిరిగి వెళ్తూ మద్యం తాగాడు. ఆయనకు గతంలో తరచుగా వచ్చే ఫిట్స్(మూర్ఛ) రావటంతో కిందపడిపోయాడు. ఆలస్యంగా.. చూసిన గ్రామస్తులు భార్య వరలక్ష్మికి సమాచారం ఇచ్చారు. ఆమె బంధువుల సాయంతో భర్తని జిల్లా ఆస్పత్రికి తరలించింది. అప్పటికే శేఖర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


సంపత్ కుమార్ రెడ్డి (ఫైల్)

దేవరకద్ర రూరల్: రైలు కింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం డోకూర్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. డోకూర్‌కు చెందిన సంపత్‌కుమార్ రెడ్డి(30) గ్రామ సమీపంలోని రైల్వే పట్టాల పై గుర్తు తెలియని రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల సమాచారంతో రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చెంచు మహిళ హత్య

కొల్లాపూర్/కొల్లాపూర్ రూరల్: పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనుల వద్ద చెంచు మహిళ దారుణహత్యకు గురైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ బాలవెంకటరమణ కథనం ప్రకారం.. కొల్లాపూర్ మండలం ఎల్లూరు చెంచు గూడేనికి చెందిన చెన్నమ్మ(40), భర్త బల్మూరు కురుమయ్య ఇద్దరు కలిసి కోతిగుండు సమీపంలో పోడుభూమి సాగుచేస్తూ, కృష్ణానదిలో చేపల వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఆమె కొల్లాపూర్‌లో సంత చేసుకొని సాయంకాలం 4గంటలకు పాలమూరు ప్రాజెక్టు పనులు చేపట్టిన ప్రాంతం గుండా పొలం వద్దకు వెళ్లింది. సోమవారం ఉదయం వరకు ఆమె కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో వెతికారు. పాలమూరు ప్రాజెక్టు అప్రోచ్ చానల్ రెగ్యులేటరి కింది బాగంలో చెన్నమ్మ మృతదేహం లభించింది. ఆమె శరీరంపై గోర్లతో రక్కిన గాయాలున్నాయి. ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులే ఆమెపై అత్యాచారం చేసి హత్య చేశారని కుటుంబసభ్యులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగర్‌కర్నూల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో చోరీ కేసులో వ్యక్తికి రిమాండ్

కందనూలు : జిల్లా కేంద్రంలో ఆటో చోరీ చేసిన వ్యక్తిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. పెద్దకొత్తపల్లికి చెందిన చంద్రకంటి శేఖర్ జిల్లా కేంద్రంలో ఈ నెల 6న ఆటోను, గతంలో వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం మండలంలో మరో ఆటోను చోరీ చేశాడు. పోలీసులు కేసు న మోదు చేసి సీసీ పుటేజీ ద్వారా దర్యాప్తు చే యగా శేఖర్ ఆటోలు చోరీ చేసినట్లు గుర్తించా రు. చోరీ చేసిన రెండు ఆటోలను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చోరీయత్నం కేసులో..

గద్వాల క్రైం: చోరీ యత్నం కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల పట్టణ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. గద్వాల పట్టణం నల్లకుంట కాలనీలో సుజాతమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. పట్టణానికి చెందిన విజయ్ రెండు రోజుల క్రితం ఇంట్లోకెళ్లి ఆమె మెడలోని బంగారు గొలుసు అపహరించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ఆమె పెంపుడు కుక్క నిందితుడిపై దాడి చేయడంతో తప్పించుకుపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ పుటేజీల ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం పట్టణ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితున్ని అదుపులోకి తీసుకొని విచారించారు. నిందితుడిని గద్వాల కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమీకృత మార్కెట్ ఇంకెన్నాళ్లకు..?

- పునాదులతో దర్శనం.. నిర్మాణంలో ఆలస్యం
- కూరగాయల విక్రయాలకు ఇబ్బందులు
- పనుల్లో జాప్యం.. పట్టించుకోని అధికారులు

జడ్చర్ల: పట్టణంలో కూరగాయల కొనుగోలు చేయాలంటే ఒక చోటుకు, మటన్, చికెన్ కొనాలంటే మరోచోటుకు, చేపలు, పండ్లు, పూలు, పాలు తదితర నిత్యవసర వస్తువులు కొనాలంటే వేర్వేరు చోట్లకు వెళ్లాలి. ఈ పరిస్థితిని అధిగమించి అన్నీ ఒకే చోట లభించేలా తెలంగాణ ప్రభుత్వం రెండేళ్ల క్రితం సమీకృత(ఇంటిగ్రేటెడ్) మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈ మార్కెట్ ఏర్పాటుతో ప్రజలకు కావల్సిన అన్ని వస్తువులు ఒకే చోట దొరకడం వల్ల కాలయాపన తప్పుతుంది. ఆయా వస్తువుల కోసం హరీబరీగా తిరగాల్సిన పరిస్థితి ఉండదు. దీంతో పట్టణ ప్రజలకు ఉపశమనం కలుగుతుంది.

రూ.4.50 కోట్లతో పనులు..

జడ్చర్ల పురపాలికలో సమీకృత మార్కెట్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. అధికారులు, పాలకులు సమీకృత మార్కెట్‌ను ఏర్పాటు చేసేందుకు కావల్సిన స్థలం ఎంపికపై కసరత్తు చేసి చివరకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న స్థలాన్ని ఖరారు చేశారు. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి దాదాపు ఏడాది పూర్తి అయినా మార్కెట్ నిర్మాణ పనుల్లో పురోగతి లేదు.

పునాదులకే పరిమితం..

సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు పునాదులకే పరిమితమయ్యాయి. పుటింగ్ పనులు పూర్తి చేసి మిగతా పనులు వదిలేశారు. చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత కొరవడిందన్న ఆరోపణలున్నాయి. సమీకృత మార్కెట్ నిర్మాణంపై సంబంధిత అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

సరిపడని స్థలం..

సమీకృత మార్కెట్ యార్డుకు కనీసంగా రెండెకరాల స్థలం ఉండాలి. కూరగాయలు, మాంసం, పూలు, పండ్లు, పాలు వంటి వ్యాపార దుకాణాలకు వేర్వేరుగా షెడ్ల ఏర్పాటు చేయాల్సి ఉంది. కొనుగోలుదారులకు వీలుగా వాహనాల పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాలి. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న సమీకృత మార్కెట్ నిర్మాణానికి అంతస్థలం అందుబాటులో లేదు. పట్టణ ప్రజలకు సౌకర్యంగా మార్కెట్‌కు అనువైన స్థలం లేకపోవడంతో చివరకు మండల పరిషత్, మండల మహిళా సమాఖ్య, ఎంఆర్‌సీ, వ్యవసాయశాఖ కార్యాలయాలు కొనసాగుతున్న ప్రాంగణంలో సమీకృత మార్కెట్‌కు స్థలాన్ని ఎంపిక చేశారు. ఇదే స్థలంలో పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ విభాగాల భవనాలు ఉండగా వాటిని కూల్చేసి సమీకృత మార్కెట్‌కు అనువుగా చదును చేశారు. అయినా మార్కెట్‌కు సరిపడేంత స్థలం లేదు.

కోర్టు స్థల సేకరణకు చర్యలు..

ఇదే ఆవరణలో ఓ పక్క కోర్టు ఉంది. కోర్టును అక్కడి నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రధాన రహదారికి దగ్గర మండల పరిషత్ కార్యాలయం ముందు భాగంలో కోర్టు భవనాన్ని నిర్మించేందుకు వీలుగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకున్నారు. నూతన భవనం పూర్తయి కోర్టును అక్కడికి తరలిస్తే తప్పా సమీకృత మార్కెట్‌కు సరిపడ స్థలం ఏర్పడదు.

ప్రస్తుతం క్రయవిక్రయాలకు ఇబ్బందులు..

పట్టణంలో కూరగాయల క్రయవిక్రయాలకు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అటు అమ్మకం దారులు, ఇటు కొనుగోలుదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూరగాయలు తెచ్చే రైతులు ఎక్కడ అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. నేతాజీ చౌరస్తాలో కూరగాయల విక్రయాలు అప్పుడప్పుడు నిర్వహిస్తారు. ఇక్కడ ప్రధాన రహదారి ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీంతో మున్సిపల్ అధికారులు ఇక్కడ కూరగాయల విక్రయాలకు అనుమతించడం లేదు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు రహదారిని అనుసరించి క్రయవిక్రయాలు సాగుతున్నాయి. మార్కెట్‌కు పంటలు తెచ్చినప్పుడు, రైల్వే రేక్ పాయింట్ నుంచి ఫర్టిలైజర్ బస్తాల తరలింపు సమయాల్లో ఇక్కడ తీవ్ర రద్దీ ఏర్పడుతుంది. కూరగాయల క్రయవిక్రయాలకు అవరోధం కలుగుతుంది.

మూతబడిన రైతుబజార్..

రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన రైతుబజార్ మూతపడింది. అటు ప్రజలకు, ఇటు కూరగాయల క్రయవిక్రయదారులకు అనుకూలంగా లేకపోవడంతో అటువైపు కన్నెతి చూసేవారే కరువయ్యారు. అధికారులు, పాలకులు స్పందించి సమీకృత మార్కెట్ నిర్మాణం తొందరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పునాదుల వద్దే నిలిచిన సమీకృతమార్కెట్ యార్డు పనులు

కాంట్రాక్టర్‌తో మాట్లాడతాం..



సమీకృత మార్కెట్ యార్డు పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు ముందుకు సాగేలా చర్యలు తీసుకుంటాం. పనుల్లో ఆలస్యం చోటు చేసుకున్నది. ఇందుకు గల కారణాలు తెలుసుకొని, త్వరగా పనులు పూర్తయ్యేలా కృషి చేస్తాం.

– లక్ష్మి, చైర్‌పర్సన్, మున్సిపాలిటీ, జడ్చర్ల

పూర్తి చేసేందుకు చర్యలు..



సమీకృత మార్కెట్ యార్డు పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. నిధుల విడుదల జాప్యం వల్ల పనులు నిలిచిపోయాయి. నాణ్యతగా సకాలంలో పనులు పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– మహ్మద్ షేక్, కమిషనర్, మున్సిపాలిటీ, జడ్చర్ల

ఇసుక టిప్పర్లను అడ్డుకున్న రైతులు

మాగనూర్: మండల కేంద్రంలోని కొత్తపల్లి చౌరస్తాలో సోమవారం ఉదయం రైతులు ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వర్కూర్ నుంచి ఇసుక రీచ్‌లకు వస్తున్న ఇసుక టిప్పర్ల వల్ల తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నట్లు పేర్కొన్నారు. ఇసుక రీచ్ యాజమానులకు మైనింగ్ అధికారులు ఆంక్షలు విధించినా పాటించడం లేదన్నారు. టిప్పర్లు తిరిగే రోడ్లపై దుమ్ము దూళీ లేవకుండా నిత్యం ట్యాంకర్లతో నీళ్లు కొట్టించాలని, మైనర్లకు డ్రైవింగ్ ఇవ్వకుండా, ట్రాక్టర్లకు సాండ్ బాక్స్‌లు బిగించవద్దని సూచించినట్లు తెలిపారు. మైనింగ్ అధికారుల చెప్పిన నియమ నింబంధనల్లో ఏ ఒక్కటీ పాటించడం లేదని పేర్కొన్నారు.

మధ్యాహ్నం 12 గంటల సమయంలో మైనింగ్ ఆర్‌ఐ రమేష్ అక్కడికి వచ్చి రైతులతో మాట్లాడినా, వారు వినకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయాడు. సాయంత్రం 4 గంటలకు ఇసుక రీచ్ వారు రైతు నరహరిపై మాగనూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు రైతును అదుపులోకి తీసుకుని, టిప్పర్లను వదిలేశారు. తమ సమస్య తీర్చాలని అడిగితే తమపై కేసులు పెట్టడం ఏమిటని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

11మందికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: మద్యం తాగి వాహనాలు నడిపిన 11మందికి కోర్టులో న్యాయమూర్తి జరిమానా విధించారు. మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో మద్యం తాగి వాహనాలు నడిపిన 11మంది పట్టుబడ్డారు. వారందరిని సోమవారం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి డీ నిర్మల వాహనదారులకు రూ.27వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పక ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపరాదని అన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి భేష్


తిర్మలాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

రాజాపూర్: గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు భేష్‌గా ఉన్నాయని కేంద్ర బృందం సభ్యులు కర్పూరపు అరుణసాయితేజ్, అంద్రాజు అంబికశ్రీలు తెలిపారు. మండలంలోని తిర్మలాపూర్, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం కేంద్రం బృందం సభ్యులు పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి నిర్మించుకోవడం, వాటిని వాడుకునేలా గ్రామస్తులకు అవగాహన కల్పించినట్లు తిర్మలాపూర్ సర్పంచ్ మహేశ్వరి కేంద్ర బృందం సభ్యులకు వివరించారు. ఇంకుడు గుంతలు, అండర్ డ్రెయినేజీలు చేపట్టినట్లు తెలిపారు. సీసీరోడ్లు, రోడ్డు కిరువైపుల ప్లాంటేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ లక్ష్మీదేవి, ఏపీఓ భారతి, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు


నల్లమల అటవీ ప్రాంతంలో వాచ్ టవర్ ప్రారంభంలో పాల్గొన్న అటవీ శాఖ ఉన్నతాధికారులు

లింగాల: నల్లమల అడవుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పీసీసీఎఫ్ డబ్ల్యూఎల్ లోకేష్ జయస్వాల్ అన్నారు. సోమవారం మండలంలోని నల్లమల ప్రాంతంలోని అప్పాయపల్లి పరిధిలోని గిరిజ గుండాల సమీపంలో కొత్తగా నిర్మించిన 'వాచ్ టవర్'ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాచ్ టవర్ వల్ల అటవీ ప్రాంతాన్ని రక్షించవచ్చన్నారు. అడవిలో అసాంఘిక కార్యక్రమాలు, అడవుల దహనం, వన్యప్రాణుల వేట తదితర వాటిని వాచ్‌టవర్ ద్వారా గుర్తించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఏటీఎల్ క్షితిజ, ఎఫ్‌డీఓ ఎఫ్‌సీ పార్టీ శ్రీనివాస్, ఎఫ్‌ఆర్‌ఓ వీరేశం, శరత్ చంద్రారెడ్డి, ఖాదర్‌పాష, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లేగదూడపై చిరుత దాడి


లేగ దూడను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారి

మరికల్: లేగదూడపై అర్ధరాత్రి చిరుత దాడి చేసి చంపిన ఘటన రాకొండ శివారులో చోటుచేసుకుంది. రాకొండ గుట్ట దగ్గర తన వ్యవసాయ పొలంలో ఆదివారం సాయంత్రం రైతు శివారెడ్డి పశువులను కట్టేసి ఇంటికొచ్చాడు. అర్ధరాత్రి సమయంలో చిరుత లేగదూడపై దాడి చేసి చంపేసింది. సోమవారం ఉదయం పొలానికి వెళ్లిన రైతు చనిపోయిన లేగదూడను చూసి సర్పంచ్ రాజుకు చెప్పడంతో, సర్పంచ్ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ఘటనా స్థలానికి అటవీశాఖ బీట్ ఆఫీసర్ మల్లేష్ చనిపోయిన లేగదూడను పరిశీలించి చిరుత దాడిలో మృతి చెందినట్లు నిర్ధారించాడు.

రేషన్ బియ్యం పట్టివేత



వీపనగండ్ల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మండలంలోని గోవర్ధనగిరిలో పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసుల కథ నం ప్రకారం.. కర్నూల్ జిల్లా దేవరకొండ మండలం కేతేపల్లికి చెందిన ఎరుకలి దుబ్బన్న, మద్దిలేటిలు బొలేరో వాహనంలో 26 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో కొల్లాపూర్ నుంచి పెబ్బేరుకు తరలిస్తుండగా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అధికారులు గోవర్ధనగిరి వద్ద పట్టుకోని పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రవిప్రకాశ్ తెలిపారు. పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని వనపర్తి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ నందకిషోర్ పంచనామా నిర్వహించారు.

ప్రేమించి మోసం చేశాడని పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని మాచినేనిపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని మాధవరావుపేటకి చెందిన కిరణ్ 10 సంవత్సరాల నుంచి ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌కి చెందిన కవిత తనకు పుట్టిన బాబుతో కలిసి సోమవారం పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలిపింది. కిరణ్ తల్లిదండ్రులు కట్నం తెస్తేనే పెళ్లి చేసుకుంటామని వేధిస్తున్నారని చెప్పింది. నాకు రెండు సంత్సరాల బాబు ఉన్నాడంది. కిరణ్ తలిదండ్రులు కులం పేరుతో ఇంట్లోకి రానివ్వడం లేదన్నారు. ఈ విషయమై సీఐ యాలాద్రిని వివరణ కోరగా.. కిరణ్‌పై కేసు చేసి నెలరోజుల కిందటే రిమాండ్‌కు తరలించామన్నారు. అత్తామామలు కులం పేరుతో వేధిస్తున్నారని బాధితురాలు కవిత ఫిర్యాదు చేసిందన్నారు. ఈ సంఘటపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

మహాయాగానికి చురుకుగా ఏర్పాట్లు

- ఈ నెల 14 నుంచి 27 వరకు నిర్వహణ
- జడ్చర్లలో 80వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవం

జడ్చర్ల: ప్రకృతి సమతుల్యత, విశ్వశాంతి, సమస్త మానవాళి, జీవరాసుల మనుగడ, సమస్త కర్మలు, పాప దోశాల నివారణ కోసం జడ్చర్లలో ఈనెల 14వ తేదీ నుంచి ఆయిత చండీ అతిరుద్రం 80వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా తాలూకా క్లబ్ రోడ్డు సమీపంలోని విశాలమైన మైదానంలో మహోత్సవ యజ్ఞ యాగాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 14వ తేదీన గణపతి పూజతో మొదలై, ఈనెల 27వ తేదీ వరకు ప్రతి రోజూ వివిధ కార్యక్రమాలు, పూజలు, యాగాలు, యజ్ఞాలు నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా శ్రీ కృష్ణ పీఠాధిపతి శ్రీ కృష్ణ జ్యోతి స్వరూపానంద స్వామి మాట్లాడుతూ ఆయురారోగ్యాలను కాంక్షిస్తూ అయిత చండీ అతిరుద్రం మహాయాగం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యజ్ఞ హోమాలకు 50 లారీల రావి, మోదుగ సమిదలను వినియోగిస్తామన్నారు. 60వేల కిలోల ఆవు నెయ్యిని హోమాలలో వినియోగించనున్నట్లు తెలిపారు. లక్ష తమలపాకులతో అర్చన, 10 వేల పార్థీవ లింగాలకు 2వేల ఆవుల నుంచి తీసుకొచ్చిన పాలతో అభిషేకం చేస్తామన్నారు. భక్తులకు ఉదయం, సాయంత్రం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం అన్న ప్రసాదం అందజేస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో కార్యక్రమాలకు హాజరై విజయవంతం చేయాలని కోరారు.


జడ్చర్ల శివారులో యాగానికి సిద్ధమవుతున్న మండపం

సైకిల్‌పై 17 రాష్ట్రాలు చుట్టేశాడు..


దేవరకద్ర: దేశంలో శాంతి నెలకొల్పాలని, ఎలాంటి మత ఘర్షణలు లేకుండా చూడాలని ప్రార్థిస్తూ ఒక వ్యక్తి 17 రాష్ట్రాలు చుట్టేశాడు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లా సింధనూర్ పట్టణానికి చెందిన విజయ గోపాలకృష్ణ దేశ శాంతి కోసం 2022 మార్చి 11వ తేదీన సింధనూర్‌లో సైకిల్ యాత్ర ప్రారంభించాడు. నిర్విరామంగా యాత్ర కొనసాగిస్తూ 17 రాష్ట్రాలను చుట్టేసి చివరగా తన సొంత ఊరుకు బయలు దేరాడు. సోమవారం దేవరకద్ర పట్టణానికి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, రాజస్థాన్, ఒడిస్సా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, యానం, తెలంగాణ మీదుగా తిరిగి కర్ణాటక వెళ్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 514 రోజులు సైకిల్ యాత్రను కొనసాగించినట్లు తెలిపారు. దేశంలో 12 పుణ్య నదులు ఉండగా, 11 పుణ్యనదుల్లో స్నానం చేసి ప్రముఖ దేవాలయాలను సందర్శించుకుని పూజలు చేశానన్నారు. త్వరలో తన సొంత పట్టణానికి చేరుకుంటున్నట్లు తెలిపారు.


దేవరకద్రకు చేరుకున్న కర్ణాటక వాసి విజయ గోపాలకృష్ణ

జూరాలకు పెరిగిన వరద

- 74 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. 5 క్రస్టు గేట్ల ఎత్తివేత

ధరూరు/ మదనాపురం/ దోమలపెంట/ దేవరకద్ర/ ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో సోమవారం పెరిగింది. ఆదివారం రాత్రి 8 గంటలకు 39 వేల క్యూసెక్కులు రాగా.. సోమవారం రాత్రి వరకు 74 వేలకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. దీంతో 5 గేట్లు ఎత్తి 36,552 క్యూసెక్కులు వదిలారు. నెట్టెంపాడు రెండు పంపుల ద్వారా 1,500 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 650, కోయిల్‌సాగర్‌కు 315, జూరాల ఎడమ కాల్వకు 730 క్యూసెక్కులు వదలగా.. మరో 88 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.571 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువన ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టుకు 66,750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 70,731 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 129.72 టీఎంసీలు కాగా.. 121.262 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 67,600 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 31.01 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


జూరాల క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద నీరు

రామన్‌పాడులో 1,020 అడుగులు..

మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయానికి జూరాల ఎడమ కాల్వ ద్వారా 730 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో సోమవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,020 అడుగులకు చేరింది. దీంతో వ్యవసాయ అవసరాల కోసం ప్రాజెక్టులోని ఎన్టీఆర్ కాల్వ ద్వారా 900, కుడి, ఎడమ కాల్వల ద్వారా 20, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

కోయిల్‌సాగర్ 313 క్యూసెక్కులు

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రం వరకు 27.1 అడుగులకు చేరింది. జూరాల ప్రాజెక్టు ఉంద్యాల పంపుహజ్ నుంచి ఒక మోటారు రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. మరోవైపు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా వానాకాలం పంటలకు నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ప్రాజెక్టు పాత అలుగు స్థాయి 26.6 అడుగులు కాగా.. గేట్ల స్థాయి 32.6 అడుగులు ఉంది. మరో 5.5 అడుగుల నీరు చేరితే ప్రాజెక్టు నిండుతుంది.

నిరంతరాయంగా విద్యుదుత్పత్తి..

జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిరంతరాయంగా కొనసాగుతుంది. సోమవారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు కలిపి 433 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 106.814 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామన్నారు.

శ్రీశైలం జలాశయంలో..

శ్రీశైలం జలాశయానికి ఎగువ నుంచి జూరాల నుంచి 56,902 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తుంది. ఇదే సందర్భంలో ఏపీ జెన్‌కో పరిధిలోని కుడి గట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 4,975 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. అలాగే 24 గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకి 1,242 క్యూసెక్కుల నీటిని వదిలగా.. 301 క్యూసెక్కుల నీరు ఆవిరైంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 262.800 అడుగుల వద్ద 112.9696 టీఎంసీల నీరు నిల్వ ఉంది.